## ఎస్సారెస్పీ కెనాల్‌లో మహిళ మృతదేహం

పోచమ్మమైదాన్, అక్టోబర్ 12 : వరంగల్ సెకండ్ డాక్టర్స్ కాలనీ బ్రిడ్జి వద్ద గల ఎస్సారెస్పీ కెనాల్‌లో ఒక గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని గురువారం లభ్యమైంది. మృతురాలు దాదాపు 26 సంవత్సరాల వయస్సు కలిగి ఉంటుందని, చామన ఛాయ రంగుతో ఉండి పంజాబీ డ్రెస్, రెడ్ కలర్ పాయింట్, బ్లాక్ కలర్ టాప్ ధరించి ఉందని మట్టెవాడ పోలీసులు తెలిపారు. ఈ మృతదేహాన్ని గుర్తించినవారు ఎస్సై మట్టెవాడ సెల్ నంబర్ 8712685090, 8712685005 సమాచారం అందించాలని కోరారు.

## గర్భిణులకు పోషకాహార కిట్లు పంపిణీ

వెంకటాపురం (నూగూరు), అక్టోబర్ 12 : మండలంలోని అలుబాక హెల్త్ సబ్ సెంటర్లో కాఫేడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 60 మంది గర్భిణులకు పోషకాహార కిట్లను గురువారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పూజరి ఆదిలక్ష్మి, సర్పంచ్ రాధ, కాఫేడ్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ లూరురాజు, మండల కోఆర్డినేటర్ గొండ నుమంత్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**
I, KASANABOINA VENKATESHWARLU S/o Parvathalu (New Name) previously called KASANABOINA VENKANNA S/o Parvathalu (Old Name) and Residing at # 3-114/7, Beerappa Nagar, Thorrur, Mdl: Thorrur, Dist. Mahabubabad, T.S., India and solemnly declare.

**VEHICLES FOR SALE**
★AP24TA 6895 2011 EICHER 11.10 FBT Auction Date: 14-10-2023, Place: Shriram Auto Mall, India Ltd., Warangal. Cont: SHRIRAM FINANCE LIMITED, H.No. 15-1-237, 2nd Floor, Opp: LB College, Mulugu Road. Cell: 9849981545.
NTW-00

**WANTED**
★రామకృష్ణ గ్రూప్ Hyd, VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, బేబి కేర్, ఇంటి/ వంటపని చేయుటకు వర్కర్స్ కావలెను. భో|| + వ|| + జీతం: 15-22 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ఫోన్: 9281452833, 9281452844.
NT-320501

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**For Classified Ads**
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
9182777213
WARANAGAL
9182777556
9182777557
9182777558
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

# గెలుపే లక్ష్యం..

- జిల్లాలో 'తీన్'మార్ మోగించేందుకు బీఆర్ఎస్ వ్యూహాత్మక అడుగులు
- మూడు స్థానాల కైవసం కోసం ప్రణాళికతో ముందుకు
- 16న సీఎం సభ ఏర్పాట్లలో నిమగ్నమైన నేతలు
- లక్షమందితో నిర్వహణకు సమాయత్తం
- గులాబీ శ్రేణుల్లో నూతనోత్సాహం
- సమావేశాలతో అభ్యర్థులు ఎర్రబెల్లి, కడియం, పల్లా, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి, జడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డి బిజీ..

జనగామ, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ) : శాసనసభ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీఆర్ఎస్ జనగామ జిల్లాలోని మూడు స్థానాల్లో గులాబీ జెండా ఎగురవేసి 'తీన్‌మార్' మోగించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నది. ఆయా నియోజకవర్గాల్లో జనంలో పట్టున్న వారినే బీఆర్ఎస్ అభ్యర్థులుగా ప్రకటించడంతో గెలుపు ఖాయమైనా ఎవరికి వారే మెజార్టీ లక్ష్యంగా ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. మరోపక్క కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులను ప్రకటించకపోగా గ్రూపు తగాదాలతో సిగపట్లు పడుతుంటే క్యాడర్‌లో తీవ్ర నైరాశ్యం నెలకొన్నది. బీఆర్ఎస్ మాత్రం జనగామ, పాలకుర్తి, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గాల్లో మూడు విడతలుగా ఎన్నికల ప్రచారం చేసేందుకు పర్యటన తేదీలు అధికారికంగా ఖరారు చేసింది. దీంతో రాజకీయ ప్రత్యర్థుల గుండెల్లో గుబులు మొదలైంది. ఈనెల 16న జనగామలో ఎన్నికల సమర శంఖారావాన్ని పూరించేందుకు పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ రానుండటంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో నయా జోష్ నెలకొన్నది. సీఎం సభ విజయవంతం కోసం జనగామలో బీఆర్ఎస్ నిర్వహించిన సన్నాహక సభలో మంత్రి హరీశ్‌రావు సహా మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతి రాథోడ్ హాజరు కావడం, అదే వేదికపై పల్లా గెలుపు బాధ్యతలను ముత్తిరెడ్డి తీసుకొని ఐక్యతను చాటడంతో పార్టీ క్యాడర్‌కు కొత్త ఊపునిచ్చింది. అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి సిద్ధమైన అధినేత రెండోరోజు ఉమ్మడి వరంగల్ జిల్లాలో తొలి ఎన్నికల సభను జనగామలో నిర్వహించనున్నారు. భవిష్యత్ జనగామ ఎట్లా ఉండబోతున్నదో సభలో కేసీఆర్ ఆవిష్కరించనున్నట్లు తెలుస్తున్నది. సుమారు 50 ఎకరాల్లో లక్ష మందితో నిర్వహించేందుకు ఇప్పటికే జిల్లా కేంద్రంలోని వికాస్‌నగర్ వద్ద మెడికల్ కాలేజీకి కేటాయించిన గ్రౌండ్‌లో సభాస్థలి కోసం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంకోపక్క జనసమీకరణపై అభ్యర్థులు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, కడియం శ్రీహరి సహా ఎమ్మెల్యే ముత్తిరెడ్డి, రాజయ్యతో పాటు గులాబీ శ్రేణులు దృష్టిసారించాయి. జిల్లా పార్టీ కార్యాలయంలో ఉదయం, సాయంత్రం మండలాల వారీగా సీఎం సభకు జనసమీకరణపై ముఖ్యనేతలతో అభ్యర్థి పల్లా, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి, జెడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డి విస్తృత సమావేశాలు నిర్వహిస్తున్నారు.

### ప్రచారంలో దూసుకుపోతున్న బీఆర్ఎస్..

పాలకుర్తిలో దయాకర్‌రావు, స్టేషన్‌ఘన్‌పూర్‌లో కడియం శ్రీహరి ఇప్పటికే క్షేత్రస్థాయిలో ఒక దఫా ప్రచారాన్ని పూర్తి చేయడం.. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడం ద్వారా ఇతర రాజకీయ పక్షాలకన్నా ప్రచారంలో ముందుంజలో ఉన్నారు. అభ్యర్థిత్వం ఖరారు కంటే ముందే జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేర్యాల, జనగామ ప్రాంతంలో ముఖ్యనాయకులు, కార్యకర్తలతో పలు దఫాల్లో సమావేశాలు, సదస్సులతో ఎన్నికల సమరానికి సిద్ధం కాగా, సోషల్ మీడియా వారియర్స్ సమావేశానికి పల్లాతోపాటు హాజరైన ఎమ్మెల్సీ, కవి, గాయకుడు దేశపతి శ్రీనివాస్ సైతం దిశానిర్దేశం చేశారు.




కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యాదగిరిరెడ్డి, పక్కన ఎమ్మెల్యే అభ్యర్థి రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు

### పక్కా వ్యూహంతో సమరానికి..

విపక్షాల వ్యూహాలను చిత్తుచేస్తూ బీఆర్ఎస్ ప్రచార పర్వానికి తెరతీసింది. ఇప్పటికే జనగామ స్థానంపై మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ప్రత్యేక దృష్టి సారించగా ఏకంగా సీఎం కేసీఆర్ ఉమ్మడి జిల్లాలోనే జనగామలో మొదటి ప్రచారాన్ని ప్రారంభిస్తుండటంతో ఒక్కసారిగా జోష్ పెరిగింది. పులి వస్తుంది..కాచుకోండంటూ సోషల్ మీడియా వేదికగా పోస్టులు ట్రోలింగ్ అవుతున్నాయి. కాంగ్రెస్, బీజేపీలు ఇంకా తమ అభ్యర్థులను ప్రకటించక ముందే బీఆర్ఎస్ అభ్యర్థులు మాత్రం ప్రజలతో మమేకమయ్యారు. షెడ్యూల్ రాకముందే మంత్రులు, ఎమ్మెల్యేలు సుడిగాలి పర్యటనలు చేపట్టి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. పక్కా వ్యూహంతో బీఆర్ఎస్ ఎన్నికల సమరానికి సై అంటుండడంతో కాంగ్రెస్, బీజేపీలకు ఓటమి భయం పట్టుకుంది.

### ఊర్లకు ఊర్లే కదిలించాలి..

ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడిగా, రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శిగా కీలక బాధ్యతల్లో ఉన్న పల్లాకు ఎమ్మెల్యేగా పోటీచేసే అవకాశం కల్పించిన అధినేత ఉమ్మడి జిల్లాలోనే తొలి ఎన్నికల సభను ఇక్కడి నుంచే ప్రారంభించబోతున్నారు. దీంతో సభకు పెద్దఎత్తున జనసమీకరణ చేసేందుకు యశ్వంతాపూర్‌లోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో గురువారం పట్టణంలోని 30 వార్డులు సహా గ్రామాల వారీగా పార్టీ శ్రేణులతో అభ్యర్థి రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి సమావేశాలు నిర్వహించి జనసమీకరణ వ్యూహాన్ని ఖరారు చేశారు. అందుబాటులో ఉన్న బస్సులు, డీసీఎంలు, ఆటోలు, ట్రాలీలతో పాటు పాఠశాలలకు సెలవులు ప్రకటించిన నేపథ్యంలో స్కూల్ బస్సులను వినియోగించుకోవాలని నిర్ణయించారు. ప్రతి ఇంటి నుంచి ఒకరు చొప్పున ఊర్లకు ఊర్లనే జనగామ సభకు తరలించేలా వాహన సౌకర్యాలను ఏర్పాటు చేసుకోవాలని నిర్దేశించారు.

పదేళ్లుగా ప్రభుత్వ సంక్షేమ పథకాలతో లబ్ధిపొందిన వారిని సభకు తరలించేలా చూడాలన్నారు. మహిళా ప్రజాప్రతినిధులు గ్రామాలు, పట్టణాల్లో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు బొట్టుపెట్టి కేసీఆర్ సభకు ఆహ్వానించాలని నిర్ణయించారు. జనగామలో సీఎం సభ ద్వారా పల్లా రాజేశ్వర్ రెడ్డి భారీ మెజార్టీతో గెలుపును పక్కా చేసుకునేలా వ్యూహం రూపొందిస్తున్నారు.

# బీఆర్ఎస్ సారథులు

- నియోజకవర్గాలకు ఇన్‌చార్జిల నియామకం
- మొదటి విడుత జాబితాను ప్రకటించిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- జనగామకు మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే రాజయ్య, మాజీ ఎమ్మెల్సీ బోడకుంటి వెంకటేశ్వర్లు

వరంగల్, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ పలు నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను నియమించింది. తొలి విడుతలో జనగామ, వరంగల్ తూర్పు, మహబూబాబాద్, నర్సంపేట, భూపాలపల్లి, ములుగు నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను నియమితులయ్యారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ మేరకు గురువారం ప్రకటించారు. జనగామకు మంత్రి టీ హరీశ్ రావు, రైతు బంధు సమితి చైర్మన్ టీ రాజయ్య, బోడకుంటి వెంకటేశ్వర్లు, మహబూబాబాద్‌కు మంత్రి సత్యవతి రాథోడ్, ములుగుకు ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, భూపాలపల్లికి ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ తూర్పు సెగ్మెంట్‌కు ఎమ్మెల్సీ బండా ప్రకాశ్, నర్సంపేటకు రాష్ట్ర నీటివనరుల సంస్థ చైర్మన్ వీ ప్రకాశ్, ఇల్లందుకు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, భద్రాచలం ఎమ్మెల్సీ తాతా మధు, మంథనికి ఈత శంకర్‌రెడ్డిని నియమించారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నియమితులైన ఇన్‌చార్జిలపై ఇప్పటినుంచే పార్టీ విజయానికి అవసరమైన కార్యాచరణ, కార్యక్రమాలను చేపట్టాల్సిన బాధ్యత ఉంటుందని కేటీఆర్ తెలిపారు. ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు ఆయా నియోజకవర్గాల సంపూర్ణ బాధ్యతను వీరు తీసుకోవాలని సూచించారు. పార్టీ శ్రేణులందరినీ సమన్వయం చేసుకొని ప్రచార బాధ్యతలను నిర్వహించాల్సి ఉంటుందన్నారు.

## వ్యాపారి ఖాతా నుంచి రూ.40వేలు మాయం

కాజీపేట, అక్టోబర్ 12 : సైబర్ నేరగాళ్లు కాజీపేట పట్టణం సోమిడికి చెందిన ఓ వ్యాపారి బ్యాంక్ ఖాతా నుంచి రూ.40వేల నగదును బుధవారం మాయం చేశారు. దీంతో బాధితుడు ఆందోళనకు గురై వెంటనే కాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సోమిడికి చెందిన ఓ యువకుడు వ్యవసాయంతోపాటు వ్యాపారం చేస్తున్నాడు. తన స్మార్ట్ ఫోన్‌లో ఎటువంటి యాప్‌లను ఉపయోగించనప్పటికీ రూ.40 వేలు ఖాతా నుంచి డ్రా అయ్యాయి. వెంటనే బాధితుడు సంబంధిత బ్యాంక్ ఖాతాను బ్లాక్ చేయించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు విచారణ జరుపుతున్నారు.

## కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య

ఖిలావరంగల్, అక్టోబర్ 12 : కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఖిలావరంగల్‌లో చోటుచేసుకున్నట్లు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ టీ సురేశ్ తెలిపారు. వరంగల్ ఎల్బీనగర్‌కు చెందిన రామ అశోక్ (35) ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులకుతోడు కుటుంబ కలహాలతో అతని భార్య పుట్టింటికి వెళ్లింది. దీంతో జీవితంపై విరక్తి చెంది బుధవారం రాత్రి రాతికోటపై చెప్పులు, పర్సు పెట్టి అగడ్త చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గురువారం మిల్స్‌కాలనీపోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మృతదేహాన్ని వెలికితీశారు.

## నల్లబెల్లం, పటిక పట్టివేత

గిర్మాజీపేట, అక్టోబర్ 12 : ఐదు క్వింటాళ్ల నల్లబెల్లం, 18కేజీల పటికను గురువారం పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఏ మధుసూదన్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలోని కనిగిపురం కస్నాతండాకు చెందిన బానోత్ రంగి నల్లబెల్లం, పటికను తీసుకెళ్లుండగా విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ముడి సరుకును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని విచారణ నిమిత్తం మట్టెవాడ పోలీసులకు అప్పగించి కేసు నమోదు చేసినట్లు ఏసీపీ వివరించారు.

## మానసిక వేదనతో ఒకరి ఆత్మహత్య

దామెర, అక్టోబర్ 12 : మండలంలోని వెంకటాపురానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రాజేందర్ తెలిపిన ప్రకారం ఇజ్జగిరి సతీశ్ (36) దామెర తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. బుధవారం విధులు ముగించుకుని ఇంటికి రాగా, రాత్రి సమయంలో భార్య లలిత, తల్లి లక్ష్మి గొడవపడ్డారు. దీంతో మనస్తాపానికి గురైన సతీశ్ తెల్లవారు జామున ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# ఆటోలో మరిచిపోయిన బ్యాగు అప్పగింత

కాజీపేట, అక్టోబర్ 12 : ఆటోలో ప్రయాణించిన ఓ మహిళా ప్రయాణికురాలు మరిచిపోయిన నగలు, విలువైన వస్తువుల బ్యాగును తిరిగి ఆటో డ్రైవర్ బాధితురాలుకు పోలీసుల సమక్షంలో అప్పగించి నిజాయితీని చాటుకున్న సంఘటన కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఉదయం చోటుచేసుకుంది. కాజీపేట ఎస్సై లలిత తెలిపిన వివరాలు.. పట్టణంలోని ట్రైసిటీ ఆటో యూనియన్‌కు చెందిన ఆటో డ్రైవర్ అరూరి రవీందర్ హనుమకొండ నుంచి కాజీపేటకు వస్తున్నాడు. బాపూజీనగర్‌కు చెందిన ప్రయాణికురాలు మహ్మద్ ఫైనాజ్ హనుమకొండలో బుధవారం రాత్రి ఆటో ఎక్కి కాజీపేట చౌరస్తాలో తనకు సంబంధించిన విలువైన వస్తువులు ఉన్న బ్యాగును మరిచి దిగి వెళ్లిపోయింది. ఆటో డ్రైవర్ రైల్వే స్టేషన్‌కు వెళ్లి వెనుకకు చూడడంతో బ్యాగు కనిపించినట్లు తెలిపారు. ఆ బ్యాగును తెరిచి చూడగా అందులో నాలుగు తులాల బంగారు వస్తువులు, విలువైన సెల్‌ఫోన్, 4ఏటీఎం కార్డులు, ఆధార్‌కార్డు తదితర వస్తువులు ఉన్నట్లు తెలిపారు. వెంటనే ఆటో డ్రైవర్ రవీందర్ ఆ ఆటో యూనియన్ అధ్యక్షుడు ముచ్చు భిక్షపతి, కోశాధికారి వెంకన్న తదితర ఆటో డ్రైవర్లతో కలిసిన స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు ఎస్సై లలిత తెలిపారు. ఆ బ్యాగులో ఉన్న సమాచారంతో సదరు బాధితురాలును పోలీస్ స్టేషన్‌కు పిలిపించి ఆటోలో మరిచి పోయిన బంగారు నగలు, తదితర వస్తువులను తిరిగి అప్పగించినట్లు తెలిపారు. బ్యాగును తిరిగి బాధితురాలుకు నిజాయితీగా అప్పగించినందుకు ఎస్సై లలిత ఆటో డ్రైవర్‌ను అభినందించారు.